ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 11-11-2026 సమయం: సాయంకాలం 8గం.30ని.లు

ముఖ్యాంశాలు

- రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులను ప్రోత్సహించేందుకు పారదర్శకమైన రాయితీ విధానాన్ని అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

- కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26లో రాష్ట్రానికి ఆరు అవార్డులు లభించాయి.

- సింగపూర్ ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర విద్యాశాఖలో అమలు చేస్తున్న కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని మంత్రి నారా లోకేశ్ తెలిపారు.

- రాష్ట్రంలో వాయిదా పడిన 23 మున్సిపల్ స్థానిక సంస్థలకు రేపు ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయనున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది.

==========

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక పెట్టుబడులను ప్రోత్సహించేందుకు పారదర్శకమైన రాయితీ విధానాన్ని అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. పరిశ్రమలకు అందించే రాయితీల కోసం ఎస్క్రో అకౌంట్ విధానాన్ని తీసుకొచ్చామని వెల్లడించారు. విశాఖపట్నంలో జపాన్ రాయబారి కెయిచీ ఓనోతో ఈరోజు జరిగిన సమావేశంలో పారిశ్రామిక పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి, కీలక ఖనిజాలు, ఉక్కు పరిశ్రమ, గ్రీన్ ఎనర్జీ తదితర అంశాలపై చంద్రబాబు నాయుడు చర్చించారు. రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తున్నామని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. అలాగే యువత పెద్ద సంఖ్యలో ఉన్నారని, వారికి పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందిస్తే... అత్యుత్తమ మానవ వనరులుగా తీర్చిదిద్దవచ్చునని ముఖ్యమంత్రి తెలిపారు. ఆ దిశగా జపాన్ సంస్థలు సహకరించాలని కోరారు.

==========

రాష్ట్రం.. పారిశ్రామికంగా అభివృద్ధిని సాధిస్తోందని విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం. శ్రీ భరత్ తెలిపారు. విశాఖపట్నంలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ.. రేపటి నుంచి విశాఖ నగరంలో రెండు రోజుల పాటు జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తాయని ఆశిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రగతికి ఈ సదస్సు ఒక ముందడుగని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

==========

ఆంధ్రప్రదేశ్‌లో వాయిదాపడిన 23 మున్సిపల్ స్థానిక సంస్థలకు రేపు ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయనున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) తెలిపింది. రేపు మధ్యాహ్నం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా వివరాలు వెల్లడించనున్నారని పేర్కొంది. న్యాయపరమైన చిక్కులు, వివాదాలు తొలగడంతో ఎన్నికల నిర్వహణకు ఎస్ఈసీ నిర్ణయం తీసుకుంది. శ్రీకాకుళం, కాకినాడ, రాజమహేంద్రవరం, మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్లకు.. భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసరావుపేట, గుడివాడ, చింతలపూడి, కందుకూరు, గూడూరు, కావలి, పొన్నూరు, బాపట్ల, శ్రీకాళహస్తి, రాజాం, ఆముదాలవలస, అల్లూరు, పొదిలి, బి.కొత్తపేట, తాడిగడప మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఈ స్థానాలకు సంబంధించి రిజర్వేషన్లు ఖరారు చేసింది.

==========

సింగపూర్ ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర విద్యా శాఖలో అమలు చేస్తున్న కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ సహకారాన్ని మరిన్ని రంగాలకు విస్తరించాలని సింగపూర్ ప్రతినిధులను మంత్రి కోరారు. రాజధాని అమరావతిలోని ఏపీసీఆర్డీఏ కార్యాలయంలో సింగపూర్-ఆంధ్రప్రదేశ్ జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టాండింగ్ కమిటీ (JISC) మూడవ సమావేశం ఈరోజు జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఉపాధ్యాయులకు ఆధునిక బోధనా పద్ధతుల్లో శిక్షణతో పాటు.. ప్రభుత్వ అధికారులకు నాయకత్వ నైపుణ్యాలు, డిజిటల్ గవర్నెన్స్, స్కిల్ డెవలప్‌మెంట్ రంగాల్లో సింగపూర్ అనుభవాన్ని వినియోగించుకోవాలని ఆకాంక్షించారు.

==========

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26 అవార్డులలో రాష్ట్రానికి ఆరు అవార్డులు లభించాయి. 10 లక్షలకు పైగా జనాభా కేటగిరీలో విజయవాడ, విశాఖకు అవార్డులు లభిస్తే.. 3 లక్షల నుంచి 10 లక్షల జనాభా కేటగిరీలో గుంటూరు, రాజమహేంద్రవరంకి అవార్డులు వచ్చాయి. అదే విధంగా 50 వేల నుంచి 3 లక్షల జనాభా కేటగిరీలో తిరుపతికి అవార్డు, 20 వేల నుంచి 50 వేల జనాభా కేటగిరీలో కుప్పానికి అవార్డు లభించింది. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఈరోజు జరిగిన అవార్డుల ప్రదానోత్సవ వేడుకలలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ అవార్డులను అందుకున్నారు.

విరామం

==========

ఆంధ్రప్రదేశ్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) మధ్య మంచి భాగస్వామ్యం ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా విశాఖపట్నంలో వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులతో ముఖ్యమంత్రి ఈరోజు సమావేశమయ్యారు. యూఏఈ మంత్రి అబ్దుల్లా బిన్ అల్ తౌక్ మర్రితో రాష్ట్రంలో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటు సహా వివిధ రంగాలలో పెట్టుబడులపై చర్చలు జరిపారు. ప్రముఖ అగ్రిఫుడ్ కంపెనీ సిలాల్ సంస్థను పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... పుట్టపర్తికి

సమీపంలో 5వ జనరేషన్ యుద్ధ విమానాల తయారీ చేపడుతున్నామని తెలిపారు. సెమీ కండక్టర్ల కంపెనీల కోసం అవసరమైన భూ కేటాయింపులు జరపనున్నామని చెప్పారు. అనంతపురంలో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటులో యూఏఈ కంపెనీలు ముందుకు రావాలని కోరారు. పంటలు, కంపెనీలకు ఇబ్బంది లేకుండా నీరు సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని యూఏఈ బృందానికి ముఖ్యమంత్రి వివరించారు.

==========

నంద్యాల జిల్లాలోని 28 మండలాల పరిధిలో ఉన్న 489 గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నామని కలెక్టర్ రాజకుమారి గణియా తెలిపారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో స్టేజ్–1 రిటర్నింగ్ అధికారులకు ఈరోజు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్బన్ స్థానిక సంస్థలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించిందని చెప్పారు. మొదటి విడతలో 9 మండలాలు, రెండో విడతలో 11 మండలాలు, మూడో విడతలో 8 మండలాల్లో ఎన్నికలు నిర్వహించనున్నామని ఆమె పేర్కొంటూ...

(వాయిస్ 20 సెకన్లు)

==========

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 342 గ్రామ పంచాయతీలకు సర్పంచులు, 3 వేల 878 వార్డులకు వార్డు సభ్యులకు రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నామని కలెక్టర్ డాక్టర్ ఆర్. మహేష్ కుమార్ వెల్లడించారు. తొలి విడత ఎన్నికలు ఈ నెల 26న, రెండో విడత ఎన్నికలు 29న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఎన్నికల సంఘం ఈ నెల 13న తొలి విడతకు, 16న రెండో విడతకు నోటిఫికేషన్లు విడుదల చేయనుందని పేర్కొన్నారు. అమలాపురం డివిజన్ పరిధిలోని 10 మండలాల్లో తొలి విడత ఎన్నికలు నిర్వహించనున్నారు. సఖినేటిపల్లి, మలికిపురం, రాజోలు, మామిడికుదురు, అల్లవరం, ఉప్పలగుప్తం, అమలాపురం, కాట్రేనికోన, ముమ్మిడివరం, ఐ.పోలవరం మండలాల్లో ఈ నెల 26న పోలింగ్ జరగనుందని తెలిపారు.

==========

కేంద్ర ప్రభుత్వం అందించే స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26 అవార్డులలో 3 నుంచి 10 లక్షలలోపు ఉన్న జనాభా కేటగిరీలో రాజమహేంద్రవరం నగరం పరిశుభ్రతలో జాతీయ పురస్కారాన్ని కైవసం చేసుకుంది. ఈ మేరకు న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఈరోజు జరిగిన అవార్డుల ప్రదానోత్సవ వేడుకలలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, కమిషనర్ రాహుల్ మీనా ఈ అవార్డును అందుకున్నారు. 2024-25 స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులలోనూ రాజమహేంద్రవరం నగరాన్ని ప్రతిష్టాత్మక ప్రామిసింగ్ స్వచ్ఛ సిటీ అవార్డు వరించగా.. ఈ ఏడాది స్వచ్ఛ సిటీ కేటగిరీలో అవార్డును సొంతం చేసుకుంది.

==========

రోడ్డు ప్రమాదాల నివారణ, విద్యార్థుల సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా ఏలూరు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కె.ప్రతాప్ శివకిశోర్ వివిధ శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో ఈరోజు పరిశీలించారు. ఇటీవల బస్సు ప్రమాదంలో 16 ఏళ్ల బాలిక మృతి చెందిన ఘటన నేపథ్యంలో విద్యార్థుల రవాణాకు అదనపు బస్సుల ఏర్పాటు, వాహనాల కండిషన్, డ్రైవర్ల బాధ్యతాయుతమైన డ్రైవింగ్, వేగ నియంత్రణ, బస్సు షెల్టర్ల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు.

==========
==========